క్లుప్తంగా

పాఠశాల సందర్శన



గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న ఎంపీ

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న హయగ్రీవ ఉన్నత పాఠశాలను రాజ్యసభసభ్యుడు బీద మస్తాన్‌రావు ఆదివారం సందర్శించారు. ప్లే గ్రౌండ్, వసతులు, పరిశుభ్రత తదితరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీ వెంట పాఠశాల డైరెక్టర్ జిలుమూడి రమేష్‌రెడ్డి, ఎస్సై జి.సుబ్బారావు, సిబ్బంది మారుతి ప్రసాద్, తుమ్మలపెంట అహరోన్ ఉన్నారు.

ముదిరాజ్ నాయకులకు సన్మానం



ఆలయం వద్ద నాయకులు

ఇందుకూరుపేట: ప్రముఖ పుణ్యక్షేత్రమైన గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి అమ్మవారిని రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ కొర్నా వెంకట నారాయణరావు, ఎన్ఆర్ఐ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కోడి నారాయణరావు ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత కోడి నారాయణరావును చైర్మన్ శాలువతో సత్కరించారు. ఆలయం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మనుబోలు: మనుబోలు గ్రామదేవతలు మనుబోలమ్మ, నాగార్పమ్మలకు ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మనోజ్‌కుమార్ శర్మ పంచామృతాభిషేకం చేసి ప్రత్యేకాలంకరణ అనంతరం కుంకుమపూజ జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో గ్రామదేవతలను దర్శించుకున్నారు. వర్షాలు బాగా కురిసి పాడిపంటలతో కళకళలాడాలని మొక్కులు కోరుకుంటూ తీర్చుకున్నారు.

పలు గ్రామాల్లో ప్రచారం



రెడ్డిపాళెంలో ప్రచారం

కొడవలూరు: ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంతంపై కొడవలూరు, విడవలూరు మండలాల్లో ఆదివారం విస్తృతంగా ప్రచారం చేశారు. కొడవలూరు మండలంలోని రెడ్డిపాళెం, రామన్నపాళెం, మానేగుంటపాడు, ఆలూరుపాడు, టపాతోపు, విడవలూరు మండలం పార్లపల్లి, రాళ్లమిట్టల్లో ప్రచారం నిర్వహించారు. రెడ్డిపాళెంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు డి.సుర మౌళి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సునీల్, జయసుధ, సుదర్శనమ్మ, వసుంధర, అన్నపూర్ణ, లక్ష్మి, మహేంద్ర, ప్రదీప్, కొండమ్మ, విజయలక్ష్మి, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

కోడూరు తీరంలో పర్యాటకుల సందడి



సముద్ర తీరంలో పర్యాటకులు

తోటపల్లిగూడూరు: కోడూరు బీచ్‌లో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. నెల్లూరులో జరుగుతున్న రొట్టెల పండగకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి జనం విచ్చేస్తున్నారు. ఈ క్రమంలో అనేకమంది కోడూరు బీచ్ సందర్శిస్తున్నారు. పిల్లలు, యువత సముద్ర స్నానాలతో ఆనందంగా గడిపారు. సాయంత్రం 6 గంటల వరకు పర్యాటకులు వచ్చారు. సాగర తీరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

విన్నారు.. స్పందించారు



వవ్వేరు రోడ్డు

బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని వవ్వేరు రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. గుంతలమయంగా ఉన్న ఈ రహదారికి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చొరవతో మోక్షం లభించింది. పంచాయతీరాజ్ నుంచి రూ.80 లక్షలు మంజూరవగా, ప్రస్తుతం టెండర్లు పూర్తయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభిస్తారు.

- వవ్వేరు రోడ్డుకు మోక్షం
- రూ.80 లక్షల మంజూరు
- చొరవ తీసుకున్న ఎమ్మెల్యే ప్రసన్న
- టెండర్ల పూర్తి.. త్వరలోనే పనులు

ఎంతమేర రోడ్డు వేస్తారంటే..	: 3 కిలోమీటర్లు
మంజూరైన నిధులు	: రూ.80 లక్షలు

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చి నుంచి వవ్వేరుకు కేవలం 3 కిలోమీటర్ల దూరం ఉంటుంది. రోడ్డు అధ్వానంగా ఉండడంతో ప్రయాణ సమయం 20 నిమిషాలపైనే పడుతోంది. ఈ గ్రామం నుంచి బుచ్చిరెడ్డిపాళెనికి ఆటోలు, ఇతర వాహనాల ద్వారా విద్యార్థులు, ప్రజలు వందల సంఖ్యలో వస్తుంటారు. రాకపోకల సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారంతా ఆవేదన చెందేవారు.

మహర్దశ

గత ప్రభుత్వ హయాం నుంచి రోడ్డు పరిస్థితి ఇలానే ఉంది. బాగు చేయాలని స్థానికులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అప్పటి ప్రభుత్వ పెద్దలు పట్టించుకోలేదు. కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఈ విషయాన్ని తెలుసుకుని వెంటనే ఈ రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. పంచాయతీరాజ్ అధికారుల చేత ప్రతిపాదనలు సిద్ధం చేయించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రూ.80 లక్షలు మంజూరు చేశారు. టెండర్లు పూర్తయ్యాయి. మరో 15 రోజుల వ్యవధిలో తారురోడ్డు వేసి వాహనదారుల కష్టాలను తీర్చనున్నారు.

గ్రామస్తుల హర్షం

వవ్వేరు రోడ్డుకు మోక్షం కలగడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎవరూ పట్టించుకోకపోవడంతో నానా అవస్థలు పడుతూనే ప్రయాణం చేసేవారు. రాత్రి వేళ అత్యవసరమైతే కలిగిరి రిజర్వాయర్ రోడ్డు మీదుగా బుచ్చిరెడ్డిపాళెం చేరుకునేవారు. త్వరలో పనులు చేయనుండడంతో గ్రామస్తులు ఆనందంగా ఉన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం



కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చొరవతో వవ్వేరు రోడ్డుకు మోక్షం కలిగింది. రోడ్డుపై గుంతలు ఎక్కువగా ఉన్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. ఆయన వెంటనే స్పందించి ప్రతిపాదలను సిద్ధం చేయించారు. దీంతో నిధులు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభమవుతాయి. నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు.

– కోటంరెడ్డి లలితారెడ్డి, నగర పంచాయతీ వైస్ చైర్‌పర్సన్

నరకయాతన నుంచి విముక్తి



వవ్వేరు రోడ్డు మీదుగా బుచ్చిరెడ్డిపాళెం చేరుకునేందుకు 20 నిమిషాల సమయం పడుతోంది. వాహనాల్లో వెళ్లే సమయంలో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఆటోలో విద్యార్థులు, ఇతరులు బుచ్చికి వవ్వేరు రోడ్డుపై వెళ్లలేక దూరమైనా కలిగిరి రిజర్వాయర్ రోడ్డుపై వెళ్తున్నారు. రోడ్డు పనులు పూర్తయితే నరకయాతన నుంచి బయటపడతాం.

– శ్యామ్, వవ్వేరు గ్రామస్తుడు

త్వరలోనే పనుల ప్రారంభం

వవ్వేరు రోడ్డు అభివృద్ధికి రూ.80 లక్షలు మంజూరయ్యాయి. త్వరలోనే తారురోడ్డు వేసే పనులు ప్రారంభిస్తాం. వేగంగా పూర్తి చేసి గ్రామస్తులకు అందుబాటులోకి తీసుకొస్తాం.

– మల్లికార్జున్, ఏఈ, పంచాయతీరాజ్

గ్రామాల్లో జోరుగా అభివృద్ధి పనులు



సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన చేసిన ఎంపీ మస్తాన్‌రావు, ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- నార్తురాజుపాళెంలో 1.55 కోట్లతో పనులు చేపట్టిన వైనం
- ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీ బీద, ఎమ్మెల్యే ప్రసన్న

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెంలో రూ.1.55 కోట్లతో చేసిన వివిధ అభివృద్ధి పనులను రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితో కలిసి ఆదివారం ప్రారంభించారు. రూ.45 లక్షల గడప గడపకు మన ప్రభుత్వం, మండల పరిషత్, జిల్లా పరిషత్ నిధులతో మూడుచోట్ల నిర్మించిన సైడ్ డ్రైయిన్లను, రూ.10 లక్షల ఎంపీ నిధులతో నిర్మించిన బస్‌షెల్టర్, రూ.10 లక్షల ఎంపీ నిధులతో చర్చి ప్రాంగణంలో నిర్మించిన సామాజిక భవనం, రూ.10 లక్షల జెడ్పీ నిధులతో ఎస్సీ కాలనీలో నిర్మించిన రీడింగ్ రూమ్, రూ.10 లక్షల గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ఎంపీ ప్రారంభించారు. అదేవిధంగా రూ.50 లక్షల నుడా నిధులతో సీసీ రోడ్డు, రూ.20 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించే సీసీరోడ్లకు రాజ్యసభ సభ్యుని చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. తొలుత హైస్కూల్ ప్లస్‌లో ఆల్ఫా మెరైన్ యాజమాన్యం సుధాకర్ యాదవ్, మస్తాన్ నాయుడు దాతృత్వంతో ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డును ఎంపీ ప్రారంభించారు. చివరిగా డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు సొంత నిధులతో సీబీఎన్ కాలనీలో నిర్మించిన పోలేరమ్మ ఆలయాన్ని బీద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అభివృద్ధి పనులను తన చేతుల మీదుగా ప్రారంభింపజేయడం ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. ఇందుకు చలపతిరావు చేసిన కృషి స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. నార్తురాజుపాళెం అభివృద్ధికి మారుపేరని కితాబిచ్చారు. ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ నా సోదరుడితో సమానమైన చలపతిరావు నార్తురాజుపాళెం వాసి కావడం గ్రామస్తులు చేసుకున్న అదృష్టంగా చెప్పారు. కుటుంబం కంటే గ్రామం గురించి పరితపించే ఆయన తన వెంట ఉండడం నా అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీఓలు ఈ.రమాదేవి, పి.సుబ్రహ్మణ్యం, ఎంఈఓలు జి.వసంతకుమారి, ఎస్.అంకయ్య, హెచ్ఎం డి.ఓబులేసు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, ఎంపీపీ గాలి జ్యోతి, సర్పంచ్, ఉప సర్పంచ్‌లు బి.సుప్రియ, వీరి కళ్యాణి, ఎంపీటీసీ పోసిన అనిల్‌కుమార్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ కొండా శ్రీనివాసులురెడ్డి, నాయకులు ఎస్.మాణిక్యరావు, ఎండీ కరిముల్లా, జెల్లి కుమార్, పంచాయతీ కార్యదర్శి జి.జాలయ్య పాల్గొన్నారు.

వినూత్నంగా..

- కాగితాలపూరులో డ్రాగన్ ఫ్రూట్ సాగు

మనుబోలు: మండలంలో అధికంగా వరి, నిమ్మ సాగు చేస్తారు. అక్కడక్కడా మామిడి, సరుగుడు, మిరప, కూరగాయలు వేస్తారు. ఇందుకు భిన్నంగా ఓ రైతు కాగితాలపూరు గ్రామంలో డ్రాగన్ ఫ్రూట్ సాగుకు శ్రీకారం చుట్టాడు. ఈ ఫ్రూట్‌కు మార్కెట్‌లో డిమాండ్ బాగుండడంతో కొంతకాలంగా జిల్లాలో దీని సాగు పెరుగుతోంది. గ్రామ సర్పంచ్ కూడా అయిన చెముడుగుంట ఏడుకొండలు వినూత్నంగా ఆలోచించి అరెకరా పొలంలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేపట్టాడు. ఇందుకోసం సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేశారు. పైప్‌లైను ఏర్పాటు చేసి డ్రిప్ ద్వారా నీటి సరఫరా చేస్తారు. రెండేళ్ల నుంచి మొదలై మూడేళ్లకు పూర్తి స్థాయిలో ఫలసాయం వస్తుంది. 15 ఏళ్ల వరకూ దిగుబడి ఇస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో కేజీ రూ.200 నుంచి రూ.250 వరకూ ధర పలుకుతోంది.



డ్రాగన్ ఫ్రూట్ తోట

రూ.6 లక్షల ఖర్చు

ఇంటి ఎదురుగా ఖాళీ స్థలం, నీటి వసతి ఉండడంతో డ్రాగన్ ఫ్రూట్ సాగుకు పూనుకున్నా. మొక్కల్ని కోట నుంచి తెచ్చా. సిమెంట్ పిల్లర్లు, వైరింగ్, డ్రిప్ సిస్టం అంతా రూ.5 నుంచి రూ.6 లక్షల వరకూ ఖర్చవుతుంది.

– ఏడుకొండలు

కసుమూరు దర్గాకు పోటెత్తిన భక్తులు



దర్గా బయట సందడి

వెంకటాచలం: మండలంలోని కసుమూరు దర్గాకు భక్తులు ఆదివారం పోటెత్తారు. మధ్యాహ్నం వరకు స్వల్పంగానే ఉన్నా సాయంత్రానికి వేల సంఖ్యలో విచ్చేశారు. నెల్లూరులోని బారాషహీద్ దర్గా వద్ద జరుగుతున్న రొట్టెల పండగకు వివిధ ప్రాంతాల నుంచి జనం తరలివస్తున్న విషయం తెలిసిందే. వారిలో అనేకమంది మంది కసుమూరుకు వస్తున్నారు. వాహనాల రద్దీ పెరగడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సీఐ కె.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు. వాహనాలను దర్గా ప్రాంగణం వద్దకు అనుమతించకుండా నియంత్రించారు. భక్తులు మస్తాన్‌వలీ దర్గాను దర్శించుకుని, చందన్ మహల్, కసుమూరు చెరువు కట్ట తదితర ప్రాంతాల్లో సేద తీరారు.



దర్గాలో భక్తుల ప్రార్థనలు

ఆలయ దక్షిణ ద్వారం ప్రారంభం



ఆలయం వద్ద దాత, కుటుంబసభ్యులు తదితరులు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయ దక్షిణ ద్వారాన్ని ఆదివారం బెంగళూరు సిటీ అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ పోలీస్ మువ్వా చంద్రశేఖర్, ఆయన సతీమణి ప్రీతి సెలిహా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు మాట్లాడుతూ నవరాత్రుల్లో భాగంగా ఉత్సవమూర్తులను బయటకు తీసుకెళ్లేందుకు ఆలయ దక్షిణ ద్వారం సరిపోక ఇబ్బందులు పడేవారమని గుర్తుచేశారు. ఈ విషయాన్ని మువ్వా చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లగా దక్షిణ ద్వారం ఆధునికీకరణకు అవసరమైన ఆర్థిక సాయాన్ని చేస్తానని చెప్పారన్నారు. ద్వారాన్ని ఆధునికీకరించి నూతనంగా పెద్ద గేట్లను ఏర్పాటు చేశామన్నారు. ద్వారం ప్రారంభోత్సవం అనంతరం దాతలు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని శేషవస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఈఓ వెంకటేశ్వర్లు, గాలి కామాక్షయ్య దంపతులు పాల్గొన్నారు.

భక్తజనసంద్రం



- స్వర్ణాల చెరువుకు పోటెత్తిన భక్తులు

నెల్లూరు(మినీబైపాస్): రొట్టెల పండగను పురస్కరించుకొని నగరంలోని స్వర్ణాల చెరువుకు భక్తులు ఆదివారం పోటెత్తారు. తమ కోర్కెలు తీరాలని కాంక్షిస్తూ రొట్టెలు పట్టుకునేందుకు పోటీపడ్డారు. విద్యుద్దీప కాంతులతో దర్గా ప్రాంగణం శోభిల్లింది. స్వర్ణాల చెరువులో రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోటు షికారు కోసం పలువురు క్యూ కట్టారు.

ప్రపంచ శాంతి కోసం..



ప్రపంచ శాంతి కోసం రొట్టెను వదిలా. ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ఆయురారోగ్యాలతో పాటు శాంతియుతంగా ఉండాలని కాంక్షిస్తూ ఇక్కడికి వచ్చి రొట్టెను వదిలా.

– ఖలీఫ్, చిత్తూరు జిల్లా

ఏర్పాట్లు బాగున్నాయి



ఏటా ఇక్కడికి వస్తున్నా. కోర్కెలన్నీ తీరుతున్నాయి. ఈసారి ఐశ్వర్య రొట్టెను పట్టుకున్నా. ఇక్కడ ఏర్పాట్లు చాలా చక్కగా ఉన్నాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది వసతులు మెరుగుపడ్డాయి.

– లావణ్య, నెల్లూరు

మొదటిసారొచ్చాం



ఇక్కడికి రావడం ఇదే మొదటిసారి. ఆరోగ్య, గృహ రొట్టెను పట్టుకున్నాం. కుటుంబం మొత్తం వచ్చాం.

– కరిమున్నీసా, కడప

చదువు రొట్టె పట్టుకున్నా



మా పాప బాగా చదువుకోవాలని కాంక్షిస్తూ రొట్టెను పట్టుకున్నా. రొట్టెల పండగకు ఏటా వస్తుంటాం.

– రాణి, బెంగళూరు



వృద్ధురాలికి సేవలందిస్తూ..

ఉచిత వైద్య శిబిరాలు

నెల్లూరు(బారకాసు): బారాషహీద్ దర్గా ప్రాంగణంలో వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాలు 24 గంటలూ పనిచేస్తున్నాయి. భక్తులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేస్తున్నారు. రెడ్‌క్రాస్ సంస్థ, కిమ్స్, అపోలో, మెడికవర్, తదితర ఆస్పత్రుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. వీటిని భక్తులు వినియోగించుకుంటున్నారు.



రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

పోస్టర్ల ఆవిష్కరణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మహిళా పోరు యాత్ర పోస్టర్లను నగరంలోని బాలాజీనగర్‌లో ఉన్న రామచంద్రారెడ్డి భవన్‌లో ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌బీ, శివకుమారి మాట్లాడారు. దేశంలో మహిళలు, మైనర్లపై దాడులు పెరిగిపోయానని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన జాతా ఆగస్ట్ ఒకటిన నగరానికి రానుందని తెలిపారు. ఐద్వా నెల్లూరు నగర, రూరల్ కార్యదర్శులు పద్మ, షాహీనాబేగం, ప్రమీల, సుబ్బమ్మ, సంపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం

నెల్లూరు(బారకాసు): ఆపదలో ఉన్న వారికి పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ అండగా ఉంటుందని సంస్థ వ్యవస్థాపకుడు కోగిలి రమేష్ రాజు అన్నారు. అయ్యప్పగుడి సమీపంలోని డ్రైవర్స్ కాలనీలో నివసిస్తున్న లక్ష్మి కష్టాల్లో ఉందనే విషయం తెలుసుకున్న సంస్థ సభ్యులు ఆమె ఇంటికి ఆదివారం వెళ్లి టిఫిన్ దుకాణం కోసం అవసరమైన సామగ్రిని అందజేశారు. వరిపరివర్ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు మాధవి సహకారాన్ని అందించారని చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు అభిషేక్, సాయిరెడ్డి, అనిల్ కుమార్, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ యూనియన్ల రౌండ్ టేబుల్ సమావేశం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో పలు విద్యుత్ యూనియన్లతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు మాట్లాడారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రామరాజు, సీఐటీయూ కోశాధికారి లక్ష్మీనరసయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి జాకీర్‌హుస్సేన్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, నేతలు మునికృష్ణయ్య, హరినారాయణ, నాగయ్య, గిరి, అంకయ్య, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ సమావేశం

నెల్లూరు(బృందావనం): నగరంలోని ఆచారివీధిలో ఉన్న క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్లో ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఊపిరితిత్తుల వ్యాధి నిపుణుడు శివమౌర్య హాజరయ్యారు. ఊపిరితిత్తులపై పాటించాల్సిన జాగ్రత్తలు, ఆహార అలవాట్లు, షుగర్ వ్యాధి తదితరాలపై అవగాహన కల్పించారు. అనంతరం శివమౌర్య, రోటరీ క్లబ్ నెల్లూరు మాజీ అధ్యక్షుడు విశ్వాన్ని సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి చుండూరు కృష్ణమూర్తి, కోశాధికారి అద్దెపల్లి సుబ్బారావు, సభ్యులు మురళీకృష్ణ, చిన్నిఈశ్వరయ్య, ప్రకాశ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రతిభ కార్యవర్గం

నెల్లూరు(బృందావనం): లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రతిభ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారాన్ని మద్రాస్ బస్టాండ్ సమీపంలోని ఓ హోటల్లో ఆదివారం నిర్వహించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, కోశాధికారిగా రూపేష్, ఉపాధ్యక్షులుగా సతీష్‌కుమార్, రాఘవేంద్రరావు, ఉప కార్యదర్శిగా రంగరాజు ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యఅతిథిలుగా రీజినల్ చైర్మన్ శరత్ బాబు, జోన్ చైర్మన్ నిఖిలేష్ హాజరయ్యారు. క్లబ్ ఫౌండర్ రామ్మోహన్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

వెంకటేశ్వరపురంలోని ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నెల్లూరు, పినాకినీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.